# CLCI BIBLE COLLEGE
Christianpet - NIDUBROLU

## పది ఆజ్ఞలు - వివరణ ( The Ten Commandments - Explanation):-

### 1వ ఆజ్ఞ

"నీ దేవుడైన యెహోవాను నేనే, నేను తప్ప వేరొక దేవుడు నీకు ఉండకూడదు."

**వివరణ (What does it means?)**

మనము సమస్తమైన వానికంటె దేవునికి భయపడి, ఆయనను ప్రేమించి నమ్మి యుండవలెను.

### 2వ ఆజ్ఞ

"నీ దేవుడైన యెహోవా నామమును వ్యర్థముగా ఉచ్ఛరింపకుము."

**వివరణ (What does it means?)**

మనము దేవునికి భయపడి, ఆయనను ప్రేమించి, ఆయన పేరట శపింపకయు, ఒట్టు పెట్టుకొనకయు, మంత్రతంత్రములు చేయకయు, అబద్ధమాడకయు, వంచన చేయకయు సకల శ్రమలయందు ఆయనను పేరుపెట్టి పిలిచి, ప్రార్థించి, స్తుతించి, కృతజ్ఞత నగుపరచవలెను.

### 3వ ఆజ్ఞ

"విశ్రాంతి దినమును పరిశుద్ధముగా ఆచరించుటకు జ్ఞాపకముంచుకొనుము."

**వివరణ (What does it means?)**

మనము దేవునికి భయపడి, ఆయనను ప్రేమించి, సువార్త ప్రసంగమునుగాని, ఆయన వాక్యమునుగాని తిరస్కరింపక పరిశుద్ధముగానెంచి సంతోషముతో నేర్చుకొనవలెను.

### 4వ ఆజ్ఞ

"నీ దేవుడైన యెహోవా నీ కనుగ్రహించు దేశములో నీవు దీర్ఘాయుష్మంతుడవగునట్లు నీ తండ్రిని నీతల్లిని సన్మానింపుము."

**వివరణ (What does it means?)**

మనము దేవునికి భయపడి, ఆయనను ప్రేమించి, మన తల్లి తండ్రులను, అధికారులను తిరస్కరింపకయు, వారికి కోపము పుట్టింపకయు, వారిని ఘనముగా నెంచి సేవించి, వారికి లోబడి, వారి యెడల ప్రేమను, మర్యాదను చూపించవలెను.

## 5వ ఆజ్ఞ

*"నరహత్య చేయకూడదు."*

**వివరణ (What does it means?)**

మనము దేవునికి భయపడి, ఆయనను ప్రేమించి, మన పొరుగువాని శరీరమునకు హానినైనను, ఆపదనైనను కలుగజేయక, సమస్త శరీర శ్రమలయందు వానికి సహాయమును, ఉపకారమును చేయవలెను.

## 6వ ఆజ్ఞ

*"వ్యభిచరింపకూడదు."*

**వివరణ (What does it means?)**

మనము దేవునికి భయపడి, ఆయనను ప్రేమించి, మాటలయందును, క్రియలయందును, చిత్తశుద్ధియు, శరీరశుద్ధియు గలవారమై నడచుకొనవలెను. మరియు భార్య భర్తలు ఒకరినొకరు ప్రేమించి గౌరవించుకొనవలెను.

## 7వ ఆజ్ఞ

*"దొంగిలకూడదు."*

**వివరణ (What does it means?)**

మనము దేవునికి భయపడి, ఆయనను ప్రేమించి, మన పొరుగువాని సొమ్మునైనను, సొత్తునైనను దొంగిలింపకయు, మోసమైన సరకులచేతను, వర్తకముచేతను వానిని మన వశముచేసికొనకయు, వాని ఆస్థిని, జీవనోపాధిని, అభివృద్ధి పొందించి కాపాడుటలో వానికి సహాయము చేయవలెను.

## 8వ ఆజ్ఞ

*"నీ పొరుగువానిమీద అబద్ధ సాక్ష్యము పలుకకూడదు."*

**వివరణ (What does it means?)**

మనము దేవునికి భయపడి, ఆయనను ప్రేమించి, మన పొరుగువానికి విరోధముగా అబద్ధమాడకయు, ద్రోహము చేయకయు, కొండెములు చెప్పకయు, వానికి అపకీర్తి సంభవింప చేయకయు, అతని పక్షముగా మాటలాడి అతనిగూర్చి మంచి మాటలు పలికి అతని ప్రవర్తనను గూర్చి ప్రేమగల భావము కలిగియుండవలెను.

## 9వ ఆజ్ఞ

*"నీ పొరుగువాని యిల్లు ఆశింపకూడదు."*

**వివరణ** **(What does it means?)**

మనము దేవునికి భయపడి, ఆయనను ప్రేమించి, మన పొరుగువాని యింటిని, స్వాస్థ్యమును తంత్రోపాయముచేత సంపాదించుటకును, అన్యాయమును న్యాయమనిపించి వాని నాక్రమించుటకు కోరక, అవి అతని స్వాధీనములో నుండుటకు మనమతనికి అనుకూలముగా నుండి, తగిన సహాయము చేయవలెను.

## 10వ ఆజ్ఞ

*"నీ పొరుగువాని భార్యయైనను, అతని పనివారినైనను, అతని పశువులనైనను, నీపొరుగువానిదగు దేనినైనను ఆశింపకూడదు."*

**వివరణ** **(What does it means?)**

మనము దేవునికి భయపడి, ఆయనను ప్రేమించి, మన పొరుగువాని భార్యను లాలించి వశపరచుకొనయు, పనివారిని బలత్కారముగా తొలగింపకయు, పశువులను అక్రమముగా తోలుకొనిపోకయు, వారును అవియు అతని యొద్దనుండి చేయవలసినదంతయు చేయునట్లు మనము ప్రయత్నము చేయవలెను.

## ఈ ఆజ్ఞలన్నింటిని గూర్చి దేవుడు తెలియజెప్పినదేమి?(Conclusion)

నీ దేవుడనైన యెహోవానగు నేను రోషముగల దేవుడను. నన్ను ద్వేషించువారి విషయములో మూడు నాలుగు తరముల వరకు తండ్రుల దోషమును కుమారుల మీదికి రప్పించుచు, నన్ను ప్రేమించి నా ఆజ్ఞలు గైకొనువారిని వెయ్యి తరములవరకు కరుణించువాడనై యున్నాను.

**దీని అర్థమేమి?** **(What does it means?)**

దేవుడు ఈ ఆజ్ఞలు మీరువారినందరిని శిక్షించెదనను తెలియజేయుచున్నాడు. గనుక మనము ఆయన కోపమునకు భయపడి, ఆయన ఆజ్ఞలకు విరోధముగా ప్రవర్తింపక యుండవలెను గాని ఈ ఆజ్ఞలను గైకొనువారందరికి కృపను సకలాశీర్వాదములను దయచేసెదనని వాగ్దానము చేయుచున్నాడు. గనుక మనము ఆయనను ప్రేమించి ఆయనయందు నమ్మకముంచి ఆయన ఆజ్ఞలను సంతోషముతో గైకొనవలెను.

